క్లుప్తంగా

ఐటీఐ విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న పీఓ నవ్య

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు శుక్రవారం చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.నవ్య శిబిరాన్ని సందర్శించారు. పలు సూచనలిచ్చారు. అనిల్ నీరు కొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ తగరపువలస వైద్యబృందం వి.అవినాష్, హేమ, పీజీ హౌస్ సర్జన్ డాక్టర్లు 18 మంది హాజరై 250 మందికి వైద్యసేవలందించారు. ప్రిన్సిపాల్ టీవీ గిరి మాట్లాడుతూ ఐటీఐ పాస్ అయిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఇతర సంస్థలతో అప్రెంటీస్ ఉద్యోగంలో చేరే ముందు విద్యార్థులకు పిజికల్ పరీక్షలు చేస్తారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత నెల 3వ తేదీన నేత్ర శిబిరం, ఇప్పుడు దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలు పూర్తి చేయాలి



నవగాం వద్ద భద్రసాగరం పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: గ్రామ స్థాయిలో ప్రజా సమక్షంలో నిర్దేశించిన ఉపాధి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పాలకొండ మండలం అట్టలి, నవగాం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పర్యవేక్షించారు. గ్రామాల్లో జాబ్‌కార్డు పొందిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. వేతనదారులు పూర్తి స్థాయిలో ఉపాధి పనులకు క్రమం తప్పకుండా హాజరైతే లక్ష్యాలు నిర్దేశిత సమయాల్లో పూర్తి చేయవచ్చన్నారు. పనులు జరిగే చోట సంబంధిత సిబ్బంది కచ్చితంగా వేతనదారుల హాజరును యాప్‌లో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా సాగునీటి చెరువుల అభివృద్ధి విషయంతో శ్రద్ధ వహించాలని సూచించారు.

సచివాలయం సందర్శన



ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ సత్యం

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయాన్ని ఈఓపీఆర్‌డీ కొండపల్లి సత్యం శుక్రవారం సందర్శించారు. రికార్డులు, హాజరు పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు వర్తించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని చూశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా పూర్తి చేయాలి

పాలకొండ: సమగ్ర భూ సర్వే సక్రమంగా పూర్తి చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. మండలంలోని గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల వారీగా సర్వేపై సమీక్షించారు. ప్రభుత్వ, ఇనాం, అనాధీన భూముల విషయంలో పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలని తెలిపారు. వివాదంలో ఉన్న భూముల విషయంలో ఇరువర్గాల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లోకి చేరిన కొల రాయిలను భూ యజమానుల సమక్షంలో వేయాలని తెలిపారు. ఆయనతో పాటు డీటీ బుచ్చయ్య ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తదితరులు

సీతంపేట: స్థానిక ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సాయిదుర్గా ట్రేడర్స్‌లో విక్రయిస్తున్న ఎరువులు పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ రామారావు, పీసీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెట్ట భూముల్లో తేమ నిలిపితే
అధిక దిగుబడులు



ఈ తరహా మెట్టు భూముల్లో తేమ నిలిపితే మేలు

- వ్యవసాయ శాఖ ఏఓ వాహిని



పాలకొండ రూరల్: మెట్టు భూముల్లో వ్యవసాయం చేయాలంటే రైతులు వర్షాలపై ఆధార పడాల్సి ఉందని, రానున్న వేసవి సీజన్‌లో నీటి ఎద్దడి అధిగమించేందుకు భూమిలో తేమ నిలుపుకునేందుకు తగు చర్యలు చేపడితే చక్కటి ఫలితాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ ఏఓ ఎన్ని వాహిని పేర్కొన్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో మెట్టు భూములు సిద్ధం చేసుకునే క్రమంలో రైతులు ఈ విధమైన మెలకువలు పాటించాలని ఏఓ సూచించారు.

పొలం దున్నే పద్ధతి

మెట్టు భూముల్లో వాలుకు అడ్డంగా పదునుకు భూమిని లోతుగా దున్నడం వల్ల భూమి లోపలికి నీరు ఇంకడానికి వీలు పడుతుంది. నేల పొరల్లో కొంతవరకు నీరు నిల్వలు ఉండే అవకాశం మెరుగుపడుతుంది. భూమిని లోతుగా దున్నడం వల్ల గాలి ప్రసరణ భూమిలోకి చేరి హానికర జీవులు నశించి సూర్యరశ్మి, గాలి బాగా శోకడంతో భూమిలో పోషక విలువలతో పాటు మొక్కకు లాభాన్ని చేకూర్చే సూక్ష్మజీవులు పెరగడానికి అవకాశం ఉంటుంది. పలుసార్లు ఈ విధంగా దున్నడం వల్ల పైరుకు రక్షణ ఏర్పడుతుంది. కలుపు మొక్కలు నివారింపబడి తద్వారా ఎరువు తయారు కాబడుతుంది. పైరుకంటే ఎక్కువగా నీటిని వినియోగించుకునే ఇతర కలుపు మొక్కలు నశిస్తాయి. భూమి పైపొర వదులుగా దున్నడం వల్ల నీటిని పైకితెచ్చే దారులు విచ్ఛిన్నమై అంతర పొరలో ఉండేలా భూమి తన స్థితిని మార్చుకుంటుంది. అలాగే ఉష్ణం లోపలకు వెళ్లకుండా పైపొర కాపాడుతుంది. వర్షాలు పడేటప్పుడు అధిక శాతం నీరు భూమి లోతుల్లోకి చేరి ఎక్కువ కాలం తేమ నిలుస్తుంది.

వాలు తగ్గించడం

ఎత్తు ప్రదేశాల నుంచి మట్టిని తీసి పల్లపు ప్రదేశాల్లో వేసి ఎత్తు పల్లాలను గుంటకతో చదును చేసుకోవాలి. పైరు కోసిన వెంటనే మెట్టు భూముల్లో ఉన్న తేమను వినియోగించుకుని పొలం దున్ని భూమి చుట్టు గట్లు వేయాలి. దీని వల్ల నేల పైపొర వదులు అవుతుంది. ఈ క్రమంలో పొలంకు తక్కువ నీటిని అందించినా ఫలితం దక్కుతుంది. వర్షం పడినా ప్రయోజనం చేకూరుతుంది. ఇసుక భూముల్లో బంకమన్ను శాతం చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ నేలలు అధికంగా నీటిని పీల్చుకున్నప్పటికీ తేమ నిలుపుకునే శక్తి తక్కువగా ఉంటుంది. అందువల్ల అటువంటి నేలల్లో కొత్తగా కొంత మట్టిని, సేంద్రియ ఎరువులను కలిపి దున్నడం శ్రేయస్కరం. ఇలా చేయడం వల్ల ఇసుక నేలల్లో కూడా తేమను ఎక్కువ రోజులుగా నిలిచేలా చేయవచ్చు. ఎకరాకు 20 బండ్ల చొప్పున బంక మట్టిని వేయడం లాభదాయకమన్నారు. మెట్టు పొలాల్లో అనువుగా ఉన్న పల్లపు ప్రాంతాల్లో ఇంకుడు గోతులు తవ్వుకోవడం ద్వారా కూడా నీటి నిల్వలు ఆదా చేసుకోవచ్చని ఏఓ పేర్కొన్నారు.

గర్భిణిలకు పౌష్టికాహారం అందివ్వాలి : పీఓ



ఎస్‌కేపాడు నర్సరీలో పర్యాటకాభివృద్ధి పనుల ప్రణాళికలను పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులకు పౌష్టికాహారం సంపూర్ణంగా అందివ్వాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ సూచించారు. స్థానిక వైటీసీలో నిర్వహిస్తున్న గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులతో ఆయన మాట్లాడారు. అందుతున్న పౌష్టికాహారం, వైద్య సేవలపై ఆరా తీశారు. వసతిగృహంలోని గర్భిణులందరికీ రక్త పరీక్షలు నిర్వహించి, రక్తహీనతతో బాధపడే వారుంటే ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పౌష్టికాహారం, వసతిగృహంలో పరిశుభ్రతను పర్యవేక్షించాలని పీఓ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ఎస్‌కే పాడులోని ఉద్యానవన నర్సరీ కేంద్రాన్ని సందర్శించారు. నర్సరీలో చేపట్టనున్న పర్యాటకాభివృద్ధి పనులపై గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్, ఉద్యాన శాఖ, ఉపాధి హామీ పథకం, వాటర్‌షెడ్ పథకం అధికారులతో చర్చించారు. ఆయన వెంట టీడబ్ల్యూ ఈఈ శాంతేశ్వరరావు తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’కి నిధులు తగ్గించడంపై నిరసన



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూరయ్య

కురుపాం: ఉపాధి హామీ వేతనదారులకు కేంద్ర బడ్జెట్లో భారీగా కోత విధించిందని దీని వలన వ్యవసాయ కూలీలకు, ఉపాధి వేతనదారులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య అన్నారు. మొండెంఖల్ గ్రామంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి సంబంధించి రూ.89 వేల కోట్ల నుంచి 30 వేల కోట్లకు తగ్గించటం జరిగిందన్నారు. పోరాటం చేసి తెచ్చుకున్న చట్టానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం క్రమేపి నిర్వీర్యం చేస్తుందన్నారు. దీని వలన వేతనదారులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పువ్వల ప్రసాద్, పత్తిక మోహన్‌రావు, మండంగి సింగన్న, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు పక్కా ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీపీఎం ధనంజయరావు

గరుగుబిల్లి: ఏడాది పాటు పంటలు పండించేలా ప్రణాళికలు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం ధనుంజయరావు అన్నారు. మండలంలోని తోటపల్లి ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని జట్టు ట్రస్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాలలోని మహిళా సంఘాల సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై చర్చించి ఆచరించేలా చేయాలన్నారు. సంఘ సభ్యులు సమన్వయంతో ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ప్రయోజనం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. జట్టు ట్రస్టీ డి.పారినాయుడు మాట్లాడుతూ ఏడాది పాటు పంటలు పండిస్తే కుటుంబ ఆహార భద్రతతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం వుంటుందన్నారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని అన్ని గ్రామాలలో పూర్తి స్థాయిలో ఎరువులు లేని, పురుగు మందుల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. శిక్షణలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, ఏపీ బాబాజీ, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



జగనన్న కాలనీ నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

పాలకొండ: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శత శాతం పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కలిగించి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాలు చేపడుతున్న వారికి బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. సిమెంట్, ఇసుక, ఇనుము అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇప్పటికే కాలనీలో ఇంటర్నల్ రహదారుల నిర్మాణం పూర్తి చేశామని, విద్యుత్ సౌకర్యం కోసం పనులు జరుగుతున్నాయని తెలిపారు. తాగునీరు, రహదారులు, కాలువల నిర్మాణం పూర్తి చేసి అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. పేదవారికి సొంత గూడు కల్పించాలన్న ముఖ్యమంత్రి ఆశయం నెరవేరేందుకు అన్ని శాఖల సిబ్బంది పని చేయాలని తెలిపారు.

తల్లీబిడ్డ అదృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గొట్టాపు శిరీష అలియాస్ గుణుపూరు శిరీష తన నాలుగేళ్ల అబ్బాయి సిద్విక్ నాయుడుతో కలిసి సాయిబాబా గుడి నుండి పాలు కోసం గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లింది. తరువాత కనిపించలేదని, ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదని ఆమె తండ్రి గొట్టాపు శీతంనాయుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.రాజేష్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 91211 09469 నంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు వేలం

సీతంపేట: సారా అక్రమ రవాణా కేసులో పట్టుబడిన ఆటోను దోనుబాయి పోలీస్‌స్టేషన్‌లో శనివారం బహిరంగ వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ కిషోర్‌వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొదలచిన వారు ఉదయం పది గంటలకు దోనుబాయి స్టేషన్ వద్దకు రావాలన్నారు.

ధాన్యం కొనుగోలు కొనసాగించాలి

పాలకొండ రూరల్: ధాన్యం కొనుగోళ్లు మార్చి నెల వరకు కొనసాగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. పాలకొండ మండలంలో రబీ పంటల తీరును రైతులతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొన్ని చోట్ల ధాన్యం ఇంకా మిగిలి ఉన్నాయన్నారు. వాటిని కూడా అధికారులు ఆర్‌బీకేలు ద్వారా సేకరించాలన్నారు. ఆయన వెంట రైతు నాయకులు కె.రామూర్తినాయుడు, జి.అప్పలనాయుడు, వి.కూర్మారావు తదితరులున్నారు.

రైతులకు సూచనలు



రైతులతో మాట్లాడుతున్న ఎంఏఓ సింహాచలం

భామిని: రబీలో వరి అధిక దిగుబడులకు వ్యవసాయ సహాయకులను రైతులకు తగు సూచనలు అందించేలా సిద్ధం చేశామని ఏఓ కొర్ను సింహాచలం అన్నారు. బాలేరు ఆర్‌బీకేలో రైతులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పంటలపై రైతులతో మాట్లాడారు. ప్రతీ రైతు విధిగా ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు ఏఏ పి.సాయి తదితరులు పాల్గొన్నారు.


తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా నగదును అందజేస్తున్న సర్పంచ్ దివ్యలక్ష్మి

గరుగుబిల్లి: వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సహాయాన్ని సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి అందజేశారు. మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో కేన్సర్ వ్యాధితో ఇటీవల మరణించిన మిత్తిరెడ్డి శ్రీనివాసరావు భార్య పార్వతికి తక్షణ సహాయం కింద రూ. 10వేలు నగదును శుక్రవారం అందజేశారు. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు వైఎస్సార్ బీమా ఎంతో దోహదం చేస్తుందని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కోటేశ్వరరావు, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేతనదారుకు గాయాలు



గాయపడిన రాధమ్మను ఆస్పత్రికి తీసుకువెళ్తున్న తోటి వేతనదారు

భామిని: మండలంలోని గురండి తామర చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తుండగా వేతనదారు పొట్నూరు రాధమ్మ శుక్రవారం జారిపడి తీవ్రంగా గాయపడింది. తోటి వేతనదారులు వెంటనే భామిని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక వైద్యం అనంతరం కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఏ శివ్వాల సంపత్ ఉన్నతాధికారులకు ప్రమాద వివరాలు తెలియజేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పరీక్షిత్ రాజు

- పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

కురుపాం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని మైదానంలో కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కురుపాం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలిత క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి క్రీడలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతుందన్నారు. మానసిక ఉల్లాసం కలగడంతో ఆరోగ్యవంతంగా ఉంటామన్నారు. క్రీడల్లో గెలుపొటములను సమానంగా చూస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడలతోనే పోటీతత్వం అలవాటవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గార్ల సుజాత, టీపీఎస్ స్వామియాజులు, సంతోషిరాణి, గౌడు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు నిషార్, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీగా సంపత్‌కుమార్



వైస్ ఎంపీపీగా సంపత్‌కుమార్‌చే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్

జియ్యమ్మవలస: మండల వైస్ ఎంపీపీగా గుడివాడ సంపత్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గెడ్డ తిరువాడ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ ఇటీవల మరణించడంతో ఈ ఎన్నిక శుక్రవారం జరిగింది. ఒక్కరే నామినేషన్ వేయడంతో అంకవరం ఎంపీటీసీ పి.హేమలత ప్రతిపాదించగా జియ్యమ్మవలస ఎంపీటీసీ శంకరరావు బలపరిచారు. ఒక్కటే నామినేషన్ కావడంతో ఏకగ్రీవంగా గుడివాడ సంపత్‌కుమార్ ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి కిరణ్‌కుమార్ ప్రకటించారు. అనంతరం వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్‌చే ప్రమాణ స్వీకారం చేయించారు. తోటి ఎంపీటీసీలు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి పేరంటాల ఉత్సవం



మహాలక్ష్మి పేరంటాలకు పూజలు చేస్తున్న 200 మంది దంపతులు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న గుజ్జల వంశీకుల ఇలవేల్పు మహాలక్ష్మి పేరంటాల 46వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కనుల పండువగా జరిగాయి. విశాఖపట్టణంకు చెందిన వేదపండితులు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త గుజ్జల నారాయణరావు, జయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు గ్రామానికి చెందిన 200 మంది దంపతులు ఉపవాస దీక్షలతో శ్రీమహాలక్ష్మికి సహస్ర నామాలతో కుంకుపూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం ఉత్సవ శోభతో భక్తులకు కనువిందు చేసింది.

శ్రీమహాలక్ష్మిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఉత్సవాలు సందర్భంగా నిర్వహకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



రాజాం కేర్ ఆస్పత్రిలో లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న వలంటీరు స్వాతి



రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న వలంటీరు సీత

వీరఘట్టం: తమ గ్రామానికి చెందిన పింఛనుదారులు అనారోగ్యంతో దూరప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందుతూ రాలేని స్థితిలో ఉండడంతో వలంటీర్లు తమ సొంత ఖర్చులతో దూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్లు అందజేసి ఔదార్యాన్ని చాటుకుని అందరి మన్ననలు పొందుతున్నారు. మండలంలోని దశుమంతపురం గ్రామానికి చెందిన నారాయణపురం విజయకుమార్ అనారోగ్యంతో బాధపడుతూ రాజాం కేర్‌లో చికిత్స పొందుతుండగా, ఉంగటి సింహాచలం రాగోలు జెమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వలంటీర్లు స్వాతి, సీతలు ఆస్పత్రులకు వెళ్లి శుక్రవారం పింఛను అందజేశారు. ఇద్దరు వలంటీర్లను సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్ అభినందించారు.

కొలతల ప్రకారం పనులు



గొట్టివలసలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో కొలతల ప్రకారం పనులు చేపట్టేలా చూడాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో ముందుగా కొలతలు ఇచ్చిన అనంతరం పనులు చేయించాలన్నారు. ఉపాధి పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సంబంధించి ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్తర్లలో అటెండెన్స్ వేయాలని సూచించారు. బోగస్ మస్తర్లు వేస్తు చర్యలు తప్పవన్నారు. ఆమె వెంట ఎఫ్‌ఏ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

వేతనదారుల హాజరు పెంచాలి



నులకజోడులో పనుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

భామిని: ఉపాధి హామీ పనుల్లో పూర్తి స్థాయి వేతనదారులు హాజరయ్యేటట్టు చూడాలని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు అన్నారు. మండలం నులకజోడు, బిల్లుమడ, పసుకుడి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఉపాధి సిబ్బంది పూర్తి స్థాయి పర్యవేక్షణ కొరవడిందని ఎంపీడీఓ కృష్ణారావు గుర్తించారు. శతశాతం హాజరుతో పూర్తి స్థాయి వేతనం పొందేలా పనులు కేటాయించాలన్నారు. వేతనదారుల హాజరుపై మేట్లుతో మాట్లాడారు. ఎఫ్‌ఏలు, వేతనదారులున్నారు.